# **<u>ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయము, విజయవాడ.</u>**

**<u>పత్రికా ప్రకటన</u>.** **తేదీ.<u>07.10.2025.</u>**

**<u>బెస్ట్ స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ వారి కార్యాలయం</u>.**

ఈ రోజు **<u>ది.07.10.2025</u>** తేదీన మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తొలుత అతిథులు.. స్వచ్ఛతా వారియర్స్‌తో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గారితో పాటు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఐ. ఏ. ఎస్. గారు, పోలీస్ కమిషనర్ శ్రీ ఎస్. వి. రాజశేఖర బాబు ఐ. పి. ఎస్. గారు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ ధ్యానచంద్ర ఐ. ఏ. ఎస్. గారు తదితరులతో కలిసి 50 మంది విజేతలకు పురస్కారాలు అందజేశారు.

ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ......స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి జై స్వచ్ఛ సేవక్ నినాదాన్ని ఇచ్చారని.. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ సేవక్ దళాల ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు, దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో గౌరవ సీఎం ఆలోచనలకు అనుగుణంగా స్వచ్ఛాంధ్ర పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. నేడు పురస్కారాలు అందుకుంటున్న ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్రకు బ్రాండ్ అంబాసిడర్‌లని.. సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. అత్యంత పారదర్శకంగా రాష్ట్ర స్థాయిలో 69 అవార్డులు, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులను వివిధ కేటగిరీల్లో అందించినట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గారు తెలిపారు.

**డ్రోన్, ఏఐ సాంకేతికత అనుసంధానంతో మంచి ఫలితాలు: పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్. వి. రాజ శేఖర బాబు ఐ. పి. ఎస్. గారు**

స్వచ్ఛాంధ్రను విజయవంతంగా ముందుకుతీసుకెళ్లేందుకు ప్రభుత్వం వినూత్న విధానాలను అనుసరిస్తోందని.. జిల్లాకు 8 రాష్ట్ర, 50 జిల్లాస్థాయి అవార్డులు రావడం

ఆనందంగా ఉందన్నారు. పోలీస్ కమిషనరేట్‌కు కూడా పురస్కారం రావడం చాలా సంతోషమన్నారు. వినూత్న విధానాల అమలుతో దసరా ఉత్సవాలను విజయవంతం చేశామని.. స్వర్ణాంధ్ర సాకారానికి అవసరమైన కీలక ప్రగతి సూచికల (కేపీఐ)లో పురోగతిని ఎప్పటికప్పుడు మదించేందుకు డ్రోన్, ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నగరంలో వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు కూడా తమ శాఖ కీలక భాగస్వామ్యం అందిస్తుందని తెలిపారు.

**ఓ చిన్న పిలుపు.. పెద్ద మార్పునకు నాంది: కలెక్టర్ శ్రీ లక్ష్మీశ ఐ. ఏ. ఎస్. గారు**

ఓ చిన్న పిలుపు, సంకల్పం.. పెద్ద మార్పునకు నాంది అవుతుందని.. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జిల్లా స్వచ్ఛాంధ్రలో ముందంజలో నిలిచిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి స్వచ్ఛాంధ్ర కీలకమని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన జై స్వచ్ఛ సేవక్ నినాదం స్ఫూర్తిగా ఇకపైనా జిల్లాను స్వచ్ఛతలో నెం.1గా నిలిపేందుకు కృషిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో పురస్కార విజేతలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

* * *